
క్లుప్తంగా

అయ్యప్పస్వామికి పండ్లతో అలంకరణ


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం స్వామిని చెర్రీ పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుల కార్తీక్ దీక్షిత్ స్వామికి అభిషేకాలు చేయగా.. అయ్యప్ప మాలాధారులు భజనలు చేశారు. అనంతరం అన్న సంతర్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో జర్మనీరాజు, భగవాన్, బాలుయాదవ్ పాల్గొన్నారు.

టీజీటీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గుర్రంకొండ: స్థానిక ఏపీ గురుకుల బాలికల పాఠశాలలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ టీజీటీ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సాయిశిరీష తెలిపారు. విలేకరులతో గురువారం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో కొంతకాలంగా ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ పోస్టును గెస్ట్ ఫ్యాకల్టీ కింద భర్తీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. కావున విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు.

జీసీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ

మదనపల్లె సిటీ: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ అధ్యాపకుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా గురువారం ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీసీటీఏ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు మలిగి రాఘవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జింకల మోహన్‌వల్లి, మహిళా డిగ్రీ కాలేజీ అధ్యాపకులు గురుమూర్తి, మోహన్‌బాబు, శ్రీనివాసులు, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరూ భాగస్వాములు కావాలి

కలికిరి: పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్లు, కమిటీ సభ్యులు భాగస్వామ్యులు కావాలని ఎంఈఓ కరీముల్లా పేర్కొన్నారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో పాఠశాల కమిటీ సభ్యులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో చైర్మెన్లు, సభ్యుల విధులు, బాధ్యతలు, పర్యవేక్షణపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్లు మురాషావలి, ఖాదర్‌వలి, శైలజ, జ్యోతి, శివశంకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

రామసముద్రం: మండలంలోని కాప్పల్లె హరిజనవాడలో నిర్మించిన కుంటి గంగమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేసి పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కోటేశ్వరి


డాక్టర్.కోటేశ్వరి

మదనపల్లె: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్.కోటేశ్వరి నియమితులయ్యారు. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శివరామకృష్ణ, గాయత్రిశ్రీలు బదిలీపై వెళ్లిపోవడంతో రెండు పోస్టులకు ఇన్‌చార్జిగా డాక్టర్.కోటేశ్వరిని డీఎంఈ అధికారులు నియమించారు. ఆమె మదనపల్లె ఆస్పత్రిలో పెథాలజీ హెచ్‌ఓడీగా పనిచేస్తున్నారు.

4న ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ: స్థానిక ఆర్య వైశ్య హాస్టల్‌లో శనివారం ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్ తెలిపారు.ఉదయం తొమ్మిది గంటల నుంచి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఆయుర్వేద వైద్యులు రూపేష్, డాక్టర్ మానీశ్వరి వైద్య పరీక్షలు చేస్తారన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేస్తాం

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి సుదీర్ఘంగా కృషి సల్పుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జాబీర్ పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో ప్రారంభం జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల ఆహ్వాన పత్రిక, కరపత్రాలను ఆయన పట్టణంలోని అలీమాబాద్ జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగునాట ఒక చారిత్రిక అవసరం కోసం ఆగస్టు 10, 1974న యూటీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. విద్యారంగం వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమం ద్వారా సమాజాభివృద్ధికి కృషిచేస్తూ 50 సంవత్సరాల్లో రాష్ట్రంలో అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా అవతరించిందన్నారు. ఈనెల 5, 6, 7, 8 తేదీలలో జరిగే ప్రారంభ కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాయచోటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాఫీజ్, రాజారమేష్, రెడ్డిబసవయ్యతోపాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనప సాగు.. దిగుబడి బాగు

సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు అనకాయల కూర, దోసెలతో వండే వంటలకు భలే డిమాండ్ ఉంటుంది. పడమటి ప్రాంతాల్లో ఈ పండగ స్పెషల్. ఏ పల్లెలో చూసినా అనప.. పితికిన పప్పు, దోసెలే కనిపిస్తాయి. వారానికి మూడు సార్లయినా దాని రుచి చూడాల్సిందే. ఈ ఏడాది కురిసిన వర్షాలకు పంట దిగుబడులు కొంత బాగానే ఉండడం, ధర కూడా దక్కడంతో రైతులు మార్కెట్‌కు పెద్ద ఎత్తున తరలిస్తున్నారు.

- సంక్రాంతి పండగకు ప్రత్యేకం
- మొదలైన అనపకాయల సీజన్
- పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులు
- రూ.కిలో అనపయకాలు రూ.60


మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన అనపకాయలు

మదనపల్లె సిటీ: అనప కాయల సీజన్ వచ్చేసింది. రైతులు మార్కెట్‌ను అనపకాయలతో ముంచెత్తుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో అన్నమయ్య జిల్లాలోని పడమటి ప్రాంతంలోని రామసముద్రం, మదనపల్లె, నిమ్మనపల్లె, కురబలకోట, వాల్మీకిపురం, పీలేరు ప్రాంతాల్లో ఎక్కువగా వేరుశనగతోపాటు అనపకాయలు పండిస్తారు. నవంబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకూ ఈ కాయల సీజన్ కొనసాగుతుంది. రైతులు మార్కెట్‌కు తీసుకువస్తున్నారు.

సంక్రాంతి స్పెషల్

సంక్రాంతి పండగకు అనపకాయలు ఎంతో స్పెషల్. ఏ ఇంట్లో చూసినా ఈ కాయలతో వండిన వంటకం కనిపిస్తుంది. అనపకాయలు ఒలిచి గింజలను గిన్నెలో నీటిలో రాత్రి నానబెట్టి మరుసటి రోజు పితికి పప్పు కూరలు, చారుగా చేస్తారు. ఉదయమే దోసెల్లో పితికిపప్పు ఇష్టంగా తింటారు. కొందరు పితికిపప్పును ఎండబెట్టి నూనెలో వేపుడు చేసి తింటారు. చారు, సాంబారులోనూ వీటిని ఎక్కువగా వాడతారు.

పొరుగు రాష్ట్రాలకు.. ఎగుమతులు

మదనపల్లె పట్టణం చిత్తూరు బస్టాండులో అనపకాయల మార్కెట్ ఉంది. రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె, కురబలకోట, వాల్మీకిపురం ప్రాంతాల నుంచి మార్కెట్‌కు రైతులు రోజూ సాయంత్రం అనప కాయలను సంచుల్లో తెస్తారు. ఇక్కడి నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి చెన్నై, వేలూరు, బెంగళూరు, చిత్తూరు, తిరుపతి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు రోజూ 5వేల కిలోల అనప కాయలు వస్తున్నాయి. పొరుగు రాష్ట్రాల్లోనూ వీటికి మంచి డిమాండ్ ఉంది. మార్కెట్‌లో కిలో అనప కాయలకు రూ.60 ధర పలుకుతోంది. రుచిగా ఉండటంతో వీటిని బాగా ఇష్టపడతారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లోనూటీ ఈ కాయలకు డిమాండ్ ఉంది.

ధర పరవాలేదు



అపస కాయల ధరలు బాగున్నాయి. పురుగు పట్టడంతో కొంత దిగుబడి తగ్గింది. రెండు ఎకరాల్లో అనప పంట సాగు చేశా. నాటి అనపకాయలు కావడంతో మంచి డిమాండ్ ఉంది. ప్రతి రోజూ మార్కెట్ నుంచి చెన్నైకు ఎగుమతి చేస్తున్నారు.

– వెంకటరమణ, రైతు, రామసముద్రం

పోషకాలు మెండుగా ఉంటాయి



ఈ సీజన్‌లో మాత్రమే లభించే అనప కాయలు, పితికిన పప్పులో మంచి పోషకాలుటాయి. ఎలాంటి క్రిమి సంహారక మందులు లేకుండా వర్షాధారంగా చేలల్లో పంట పండుతుంది. కాబట్టి ఆరోగ్యానికి ఇవి చాలా మంచిది. అందుకే ఎక్కువమంది ఇష్టపడతారు.

– డాక్టర్ సరస్వతమ్మ, ఆర్ఎంఓ, సీహెచ్‌సీ, పీలేరు

పంచాయతీ అభివృద్ధికి సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరురూరల్: పీలేరు మేజర్ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీరుపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారపు సంతను ప్రతి సోమవారం శుభ్రం చేయాలని కోరారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని, వీధి లైట్ల సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో గురుమోహన్, వార్డు మెంబర్లు శ్రీనాథరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, ఉదయ్‌కుమార్, కాలేషా, సాంబశివారెడ్డి, రమణ, సచిన్, అబిద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

పీలేరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో లతీఫ్‌ఖాన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి చెత్త సేకరణ కేంద్రాలను వాడకంలోకి తీసుకురావాలన్నారు. మండలంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్‌నాయుడు, సిగ్బతుల్లా, సిద్దయ్య, అయ్యప్ప, గంగాదేవి, హిమబిందు, సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

పశువుల మంద స్థలం ఆక్రమణకు అడ్డుకట్ట


అక్రమంగా నిర్మిస్తున్న భవనం


విచారణ జరపుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

గుర్రంకొండ: పశువుల మందకు కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలను తహసీల్దారు శ్రీనివాసులు గురువారం అడ్డుకున్నారు. గుర్రంకొండ పంచాయతీ తలారివాండ్లపల్లెలో ఊరంతా సంబరాలు జరుపుకొనేందుకు వీలుగా పూర్వీకులు కొంత పసలమంద స్థలాన్ని గ్రామంలో గతంలో కేటాయించారు. ఏటా కనుమ రోజున ఇక్కడ పండగ ఘనంగా నిర్వహిస్తారు. గ్రామానికి చెందిన కొంతమంది అక్రమార్కులు ఆ స్థలంలో అక్రమ కట్టడాల నిర్మాణం చేపట్టారు. దీంతో గ్రామస్తులు ఈ విషయమై తహసీల్దారు శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. గురువారం తన సిబ్బందితో కలిసి వచ్చిన తహసీల్దారు పసలమంద స్థలాన్ని పరిశీలించారు. సర్వే చేసి అక్రమ నిర్మాణాలను నిలిపివేయించారు.

హిందూ శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పిస్తా

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె: నిమ్మనపల్లె రోడ్డు రామాచార్లపల్లె సమీపంలోని హిందూ శ్మశాన వాటికలో సౌకర్యాల కల్పనకు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..70 ఏళ్ల క్రితమే హిందూ శ్మశాన వాటిక కోసం ప్రభుత్వం 6.32ఎకరాల స్థలం కేటాయించిందని తెలిపారు. శ్మశాన స్థలంలో ఏపుగా ముళ్ల కంపలు పెరిగి, జనం వెళ్లేందుకు సౌకర్యంగా లేకపోవడంతో మాజీ సైనిక ఉద్యోగి కంచర్ల శ్రీనివాసులునాయుడు స్వచ్ఛందంగా అభివృద్ధి చేసేందుకు ముందుకువచ్చారన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన పలువురు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి తమ వంతు విరాళాలు ప్రకటించారు. అందులో బసినికొండకు చెందిన మేస్త్రీ గుట్టరమణ రూ.25వేలు, రామాచార్లపల్లె విక్రమ్ రూ.25 వేలు, కౌన్సిలర్ నాగార్జునబాబు రూ.50 వేలు, జనసేన రామాంజనేయులు రూ.50 వేలు, వాల్మీకిసంఘం పులిశ్రీనివాసులు రూ.10 వేలు, రజకసంఘం నాగయ్య రూ.10 వేలు, నాదెళ్ల రూ.10 వేలు, లారీ సుధ రూ.10 వేలు, ఎరుకుల రమణ రూ.5వేలు, షంషీర్ రూ.15 వేలు, రఘుపతినాయుడు రూ.25 వేలు ప్రకటించారు. శ్మశానవాటికలో షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.జే.వెంకటేష్, నవీన్‌చౌదరి, కత్తిలక్ష్మన్న, బాలప్పగారి వెంకటరమణ, వైఎస్.మునిరత్నం, సంగంహరి, విజయమ్మ, ఉషారాణి, బసినికొండ గ్రామప్రజలు, హిందూసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.50 వేలతో పైపులైన్ ఏర్పాటుకు కృషి


విద్యార్థులకు అన్నదానం చేస్తున్న సభ్యులు

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో పైపులైన్ ఏర్పాటు చేయనున్నట్లు మాజీ మల్లయ్య కొండ చైర్మెన్ కనుకొండ మద్దిరెడ్డి తెలిపారు. మద్దిరెడ్డి కుమారుడు గౌతంరెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పెంచిపెట్టి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మద్దిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది సుమారు రూ.50వేలతో పాఠశాలకు పైపులైను వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, శ్రీనివాసులు, చలపతి, రామమోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, శివరాం తదితరులు పాల్గొన్నారు.

అగ్నివన్నెకుల క్షత్రియుల అభ్యున్నతికి తోడ్పాటు


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పీలేరు: అగ్ని వన్నెకుల క్షత్రియుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆ సంఘం నియోజకవర్గ కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం(చిన్న), మండల ఇన్‌ఛార్జి రాజేంద్ర పేర్కొన్నారు. స్థానిక సరోజినీదేవి వీధిలో రాయలసీమ అగ్నివన్నెకుల క్షత్రియ సేవా సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్ని వన్నెకుల పేదల అభ్యున్నతికి, విద్య, ఆర్థిక సాయం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయకుమారి, పాండు, భూపతి, మణి, నాగముని, హరీష్, తేజ, వసంతమ్మ, నాగరాజు, కేశవ, బాలాజి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

పీలేరు: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని సీఐ యుగంధర్, జెడ్పీ మెయిన్ హైస్కూల్ హెచ్‌ఎం సురేంద్రనాథరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాల గ్రీన్ ఫింగర్స్ క్లబ్(జీఎఫ్‌సీ) ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని మసీదులు, ఆలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ జయపాల్‌రెడ్డి, జీఎఫ్‌సీ వ్యవస్థాపకులు శ్రీరాములు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నరెడ్డి మృతి తీరని లోటు


చిన్నరెడ్డి మృతదేహం వద్ద మౌనం పాటిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: చిన్నరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు అని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. తంబళ్లపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు డి.చిన్నరెడ్డి (78) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి మండలంలోని మరిమిరెడ్డిగారిపల్లెకు వెళ్లి మృతుడి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయానికి ఐటీసీ వెన్నుదన్ను


మామిడి తోటను పరిశీలిస్తున్న ఐటీఈ సంస్థ మేనేజర్ పురుషోత్తం

కేవీపల్లె: సేంద్రియ వ్యవసాయానికి ఐటీసీ వెన్నుదన్నుగా నిలుస్తోందని ఐటీసీ సంస్థ దక్షిణ భారత ఎస్‌పీవోల అభివృద్ధి మేనేజర్ పురుషోత్తం అన్నారు. మండలంలోని నూతనకాల్వ గ్రామంలో లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతు శివ సాగు చేసిన మామిడి తోటను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతిలో మామిడి, బొప్పాయి, అరటి పంటలు సాగుచేస్తే అందుకు ఐటీసీ సంస్థ తోడ్పాటునిస్తుందని తెలిపారు. తమ సంస్థ ద్వారా రైతులకు సాంకేతిక శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రెడ్స్ ఎన్‌జీవో సీనియర్ మేనేజర్ బోజిరాజు, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు.

రామసముద్రం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ కృషి చేస్తుందని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, మండల అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ అన్నారు. రామసముద్రం మోడల్ స్కూల్ ఆవరణలో గురువారం ఎస్టీయూ కేలండర్లు వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎస్టీయూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు.

కమిటీల ద్వారానే అభివృద్ధి సాధ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ త్యాగరాజు

కలకడ: విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యంతో నిర్వహించే పాఠశాల కమిటీల ద్వారానే అభివృద్ధి జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్ అన్నారు. కలకడ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిధులు దుర్వినియోగం కాకుండా కమిటీ సభ్యులు శ్రద్ధ చూపుతారన్నారు.

ఉత్తమ చెర్మెన్‌గా కోట.రమేష్‌నాయుడు

తన సొంత నిధులతో పెరుగు వితరణ చేసిన కలకడ ఆదర్శ పాఠశాల కమిటీ చెర్మెన్ కోట రమేష్‌నాయుడును ఉత్తమ కమిటీ చెర్మెన్‌గా గురువారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చంగల్‌రాయుడు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె: పాఠశాల అభివృద్ధిలో పీఎంసీ కమిటీలు కీలకంగా పనిచేయాలని ఎంఈఓలు ఎంఆర్.పద్మావతి, నారాయణ అన్నారు. నిమ్మనపల్లె జెడ్పీ హైస్కూల్‌లో పీఎంసీ కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులకు గురువారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల వినియోగం పారదర్శకంగా జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.భాస్కర్, బి.శ్రీనివాసులు, సి.మీనా, సుధాకర్, పద్మనాభం, స్వాతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పీలేరురూరల్: పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గానూ పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యతలపై వివరించారు. నటరాజ, సురేష్‌కుమార్, ఓబుల్‌రెడ్డి, అల్తాఫ్, నజీర్, సీఆర్‌పీలు మురళీధర్ రాజు, నాగరాజ, అశోక్‌పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: పాఠశాల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పాత్ర కీలకమని ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు అన్నారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో మండలంలోని 69 ప్రభుత్వ పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్ఎంలకు గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. రిసోర్సు పర్సన్లు సత్యానారాయణరావు, సాంబశివ, రామచంద్రారెడ్డిలు సభ్యుల విధులు, బాధ్యతలు, పాఠశాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం, బాలల హక్కుల రక్షణ కమిటీ, కమిటిపై అవగాహన కల్పించారు. సీఆర్పీలు సుధాకర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

కేవీపల్లె: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీల పాత్ర కీలకమని ఎంఈవోలు రెడ్డి బాషా, సబ్రహ్మణ్యంరెడ్డి అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో మొత్తం 72 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్య కమిటీ సభ్యులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎస్ఎంసీ చెర్మెన్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఎంసీ సభ్యులను సన్మానిస్తున్న రెడ్డిబాషా, సుబ్రహ్మణ్యం రెడ్డి

భూ సమస్యలపై వినతులను పరిష్కరిస్తాం


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు ఖాజాబీ

మదనపల్లె: రెవెన్యూ సదస్సులో సమర్పించిన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హెచ్ఎన్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, డీఎల్‌డీఓ అమరనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మాలేపాడులో జరిగిన రెవెన్యూ సదస్సులో పలువురు భూ సమస్యలు, మ్యుటేషన్, రేషన్ కార్డులు, పాసు పుస్తకాలపై అర్జీలు సమర్పించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామ, రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఖాజాబీ, ఆర్ఐ శేషాద్రి పాల్గొన్నారు.

పాపేపల్లెలో.. రెవెన్యూ సదస్సు

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లె సచివాలయం వద్ద అధికారులు గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పీరాన్‌బీ అధ్యక్షతన జరిగన సదస్సులో తహసీల్దారు సయ్యద్‌అహ్మద్ ప్రజలు, రైతుల నుంచి వినతులను స్వీకరించారు. భూముల సర్వే, మ్యుటేషన్, ఆన్‌లైన్ తదితర సమస్యలను పరిష్కరించాలని రైతులు విన్నవించారు. అలాగే సామాజిక పింఛన్లు, ఇతర సమస్యల పరిష్కారానికి సదస్సులో అర్జీలు ఇచ్చారు. తక్కువ సమయంలోనూ వినతులను పరిష్కరిస్తామని తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ వెంకటదాస్, డీఈ వెంకటరెడ్డి, ఆర్ఐ రమేష్, నవాజ్, జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.